# ప్రాచీన తెలుగుకు నవ్యకాంతులు

1. ప్రాచీన భాషగా గుర్తించేందుకు సూత్రప్రాయంగా కేంద్రమంత్రి అంగీకారం.
2. త్వరలో నిపుణుల కమిటీ ఏర్పాటుకు ప్రధాని సానుకూలం.
3. అదునుకోసమే ఎదురుచూపు
4. మరింత వేగిరం కానున్న భాషా వాదుల ప్రయత్నాలు.
5. మహానిఘంటు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్న తెలుగు విశ్వవిద్యాలయం.
6. ఫలించనున్న 'తానా' కృషి.

న్యూఢిల్లీ జనవరి 6 : తెలుగు భాషకు మళ్ళీ మంచి రోజులొస్తున్నాయి. రానున్న రెండు దశాబ్దాల్లో తెలుగు భాష అంతరించి పోనున్నదనే ప్రపంచభాషా నివేదిక తెలుగు జాతిని తట్టి లేపింది. భాషను, తద్వారా జాతి ప్రత్యేకతను కాపాడుకోవాలనే ఆకాంక్ష తెలుగు వారిలో మెండయ్యింది. అడపాదడపా మొదలైన ప్రయత్నాలు 'తానా' ఊతంతో వేగవంతమయ్యాయి. ఆంధ్రరాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో డిసెంబరు 17న ర్యాలీల రూపంలో ప్రారంభమైన భాషోద్యమం తెలుగు వారందరినీ సంఘటితంగా కార్యోన్ముఖుల్ని చేసింది. తానా గుంటూరులో నిర్వహించిన జానపద కళోత్సవాలు, విశాఖ, హైదరాబాదుల్లో నిర్వహించిన, భాషా కార్యక్రమాలు ఈ ఉద్యామానికి మరింత ఊపు తెచ్చాయి. ఈ కృషికి కొనసాగింపుగా తెలుగుకు ప్రాచీన భాష హోదా సాధించాలనే సత్సంకల్పంతో తానా ముందడుగేసింది. ఆంధ్రరాష్ట్రంలో తెలుగు భాషావికాసం కోసం జరుపుతున్న ఉద్యమ వివరాల్ని, తెలుగుకు రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న చారిత్రక వివరాల్ని అందుకు సంబంధించిన ఆకారాలు, ఆధారాల్ని తెలుగు వన్ డాట్ కాం మరియు లిఫి డాట్ కాంల ద్వారా సేకరించిన అభిప్రాయాన్ని కేంద్రసాంస్కృతిక మరియు పర్యాటకశాఖ మంత్రిణి శ్రీమతి అంబికాసోనికి సమర్పించడం జరిగింది. దీనికి అంబికాసోనీ సానుకూలంగా స్పందించారని సూత్రప్రాయంగా అంగాకరించారని, ప్రధానమంత్రి శ్రీ మన్‌మోహన్ సింగ్ దృష్టికి కూడా తీసి కెళ్లారని తెలియవచ్చింది. ప్రధాన మంత్రి కూడా దీనికి సానుకూలంగా త్వరలో దీనిపై ఒక నిపుణుల కమిటిని నియమించి వారి నుండి నివేదిక రాగానే, సరైన సమయంలో తెలుగుకు ప్రాచీన భాష హోదా కల్పించే ప్రకటన చేయనున్నట్టు అభిజ్ఞవర్గాల సమాచారం. ఈ తాజా పరిణామం తెలుగు భాషావికాసం కోసం కృషి చేస్తున్న వారందరికీ ఆనందాన్ని కలిగిస్తోంది.

ఇదిలా ఉండగా రాగల రెండు మూడు మాసాల్లో భాషోద్యమాన్ని మరింతగా విస్తరించాలని, ప్రతి రెండు మూడు నెలలకోసారి భాషా కార్యక్రమాలు నిర్వహించాలని, తానా మార్గదర్శికత్వంలో ప్రవాసులైన ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఏకం చేసే దిశగా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించడం జరిగింది. ప్రతి ఆరు నెలల కోసారి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ర్యాలీలు నిర్వహించడం ద్వారా విస్తృత స్థాయిలో భాషోత్సవాలకు ఊపునివ్వాలని కూడా నిర్ణయించడం జరిగింది.

ప్రవాసాంధ్రులకు, నివాసాంధ్రులకు ఆదాన ప్రదానాల్లో భాగంగా కొన్ని కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తెలుగును ద్వితీయ భాషగా పెట్టేందుకు తానా చేస్తున్న ప్రయత్నాలకు ఊతంగా, అందుకవసరమయ్యే బోధనా సామగ్రిని, పాఠ్య ప్రణాళికలను, పాఠ్యాంశాలను తెలుగు విశ్వవిద్యాలయం 2007 మార్చినాటికల్లా అందించగలమని వాగ్దానం చేసింది. ప్రతిగా తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాషా చరిత్రపై పరిశోధనలు జరిపేందుకు రూపొందించిన ప్రాజెక్టుకు తానా ఆర్థిక సహాయం అందించగలనని వాగ్దానం చేసింది. అన్నిటికంటే ప్రధానంగా తెలుగు భాషకు మహా నిఘంటువు లేని కొరత తీర్చడానికి తెలుగు విశ్వవిద్యాలయం పూనుకొంది. ఇందుకవసరమైన ఎలక్ట్రానిక్ ఫార్మాట్ సపోర్టును అదించడానికి తానా ముందుకొచ్చింది. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన మహానిఘంటువు త్వరలో సాకారం కాబోతుంది.

తెలుగు భాషా వికాసం కోసం, తెలుగు జాతి అభ్యున్నతి కోసం తానా జరుపుతున్న కృషికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ తానా కృతజ్ఞతగా స్మరించుకుంటుంది. ముఖ్యంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అందిస్తున్న సహకారం, భాషాభిమానులైన అనేక ప్రభుత్వేతర సంస్థలు, సంఘాలు అందిస్తున్న ప్రోత్సాహం. తానా మరిన్ని కార్యక్రమాలు చేపట్టడానికి అవసరమైన స్ఫూర్తినిస్తున్నాయి.